సమష్టి నిర్ణయాలతోనే అభివృద్ధి

- జెడ్పీ చివరి సర్వసభ్య సమావేశంలో చైర్మన్, మాజీ మంత్రి, సభ్యులు
- ఐదేండ్ల అభిప్రాయాలను పంచుకున్న చైర్మన్, సభ్యులు
- ఇదంతా గోల్డెన్ పీరియడ్ టైం అన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి





సమావేశానికి హాజరైన సభ్యులు, అధికారులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: రాజకీయాలు (పార్టీలు) వేరైనప్పటికీ.. సమష్టి నిర్ణయాలు, కృషితో మేడ్చల్ జిల్లా రూరల్ ప్రాంతంలో ప్రగతి సాధించామని జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మాజీ మంత్రి , ఎమ్మెల్యే మల్లారెడ్డి, సభ్యులు పేర్కొన్నారు. కొత్తగా ఆవిర్భవించిన మేడ్చల్ జిల్లా జెడ్పీ.. మళ్లీ ఉంటుందో లేదోనని.. మన ప్రాతినిధ్యంతోనే క్లోజ్ కావచ్చుననే అభిప్రాయాలను వారు వ్యక్తం చేశారు. శివారులోని ఓఆర్ఆర్ లోపలి పట్టణాలు (పురపాలికలు), గ్రామాలు జీహెచ్ఎంసీలో విలీనం చేయడమో.. లేదా కొత్తగా మున్సిపల్ కార్పొరేషన్లుగా ఏర్పాటు చేయడమో జరగవచ్చని ఆవేదన వ్యక్తం చేశారు. జెడ్పీ(జెడ్పీటీసీలు, ఎంపీపీ)ల పాలక వర్గం గడువు ఈ నెల4వ తేదీతో ముగియనుండడంతో మంగళవారం మేడ్చల్‌లో చివరి జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సీహెచ్ మల్లారెడ్డి, వైస్‌చైర్మన్ బేస్త వెంకటేశం, జెడ్పీటీసీలు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, శైలజ, అనిత, ఎల్లుబాయి, ఇందిర, రజిత, హరిక, జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభలో ఐదేండ్ల అనుభవాలు , పాలనా తీరుపై సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా : జెడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి

పదవీ ఉన్నా..లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉంటానని జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి అన్నారు. రూరల్ ప్రాంతం అభివృద్ధికి సహకరించడంతో పాటు కీలక ప్రాత పోషించి.. సలహాలు, సూచనలు ఇచ్చిన జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాప్రతినిధులు కూడా పార్టీలకతీతంగా ప్రగతి కోసం సహకరించారని పేర్కొన్నారు. ఘట్‌కేసర్ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ ఐదేండ్లు గోల్డెన్ పీరియడ్: మాజీ మంత్రి మల్లారెడ్డి

ఈ ఐదేండ్లు గోల్డెన్ పీరియడ్ అని, జెడ్పీటీసీలు, ఎంపీపీలకు ఇది లాస్ట్ బ్యాచ్ అని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. తెలంగాణలో అతి తక్కువ మండలాలు, 61 జీపీలతో ఏర్పడిన జెడ్పీ మనదేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడా జరగని అభివృద్ధి ఇక్కడ జరిగిందని, 61 గ్రామాల్లో సిమెంట్ రోడ్లు , డ్రైనేజీలు, క్రీడా మైదానాలు, వైకుంఠధామాలు ఏర్పాటు చేసుకున్నామన్నారు. మన బలం మనకు తెలియదని, రాజకీయాలు వేరైనా.. అందరం అభివృద్ధి విషయంలో కలిసికట్టుగా పని చేశామన్నారు. ఈ జెడ్పీలో సభ్యులుగా ఉన్నవారంతా ప్రజా సేవలో భాగంగా ఉన్నత స్థానాలకు ఎదగాలని మల్లారెడ్డి ఆకాంక్షించారు.

అభివృద్ధిలో భాగస్వామ్యాన్ని పంచుకున్నాం: వైస్ చైర్మన్ బేస్త వెంకటేశం

మేడ్చల్ రూరల్ ప్రాంతం అభివృద్ధిలో తనవంతూ భాగస్వామ్యం ఉందని జెడ్పీ వైస్ చైర్మన్ బేస్త వెంకటేశం అన్నారు. ఐదుగురితోనే జెడ్పీ నడిచిందన్నారు. నిధులు బాగానే వచ్చాయని, అధికారుల సహకారంతో ప్రగతి బాటలో నడిచామన్నారు. కీసర గుట్టలో మాజీ మంత్రి, జెడ్పీ చైర్మన్ సహకారంతో 40 మంది నిరుపేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు.

పంచాయతీ రాజ్ వ్యవస్థను పటిష్టం చేసుకుందాం: జెడ్పీటీసీ హరివర్ధన్

గ్రామాల అభివృద్ధికి పంచాయతీ రాజ్ వ్యవస్థ మూలమని, ప్రస్తుతం నిర్వీర్యం అయిపోందని, ఈ ప్రభుత్వ హయంలో పటిష్టం చేసుకుందామని జెడ్పీటీసీ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. ఇన్నాళ్లు సహకరించిన మాజీ మంత్రితో సహా అధికారులందకీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

మల్లారెడ్డి సీఎం కోరిక నెరవేరాలి: ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి సీఎం కావాలనే కోరిక నెరవేరాలని ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మేడ్చల్ ఇంకా అభివృద్ధి చెందాల్సిన అవసరముందన్నారు. పార్టీలు వేరైనా అందరూ కలిసి పని చేశారన్నారు. నా సొంత పనుల కోసం కాకుండా.. ప్రజల సేవ కోసం ఎక్కువ సమయం కేటాయించినట్లు తెలిపారు. అధికారులందరూ సహకరించారని పేర్కొన్నారు.

మాజీ మంత్రి వల్లనే జెడ్పీటీసీ అయ్యాను: శైలజా

మాజీ మంత్రి మల్లారెడ్డి కృషి వల్లే తాను మేడ్చల్ జెడ్పీటీసీ సభ్యురాలైనట్లు శైలజా తెలిపారు. అందరం ఒకే కుటుంబంలా ప్రజల కోసం పని చేశామన్నారు. గడువు ముగియటంతో కుటుంబాన్ని వదలిపెట్టినట్లు అనిపిస్తోందన్నారు.

అందరి సహకారంతో పని చేసిన: జెడ్పీటీసీ అనిత

మాజీ మంత్రి ,చైర్మన్,సభ్యులు ,అధికారుల సహకారంతో ప్రజల కోసం సేవ చేసినట్లు శామీర్‌పేట:జెడ్పీటీసీ అనిత తెలిపారు. అలియాబాద్లో ప్రభుత్వ పాఠశాలకు రెండంతస్తులు భవనం కట్టించటానికి మాజీ మంత్రి మల్లారెడ్డి కృషి మరవలేనిదన్నారు. ప్రజల కోసం కొట్లాడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు.

ప్రజల కోసం పని చేసిన: ఎంపీపీ ఎల్లుబాయి

ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రజల కోసం పని చేశానని శామీర్‌పేట్ ఎంపీపీ ఎల్లుబాయి అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పనులు చేసినట్లు తెలిపారు. పదవులు ఉన్నా..లేకున్నా ప్రజల కోసం పోరాడుతానన్నారు.

గ్రామాలను మోడల్‌గా తీర్చిదిద్దినం: ఎంపీపీ రజిత

గ్రామాల్లో అప్పటి కలెక్టర్ ఎంవీరెడ్డి సహకారంతో వారానికి ఒకసారి సమావేశాలు నిర్వహించి అభివృద్ధిలో ముందు ఉన్నామని మేడ్చల్ ఎంపీపీ రజిత అన్నారు. గ్రామాలను ఆదర్శ, మోడల్ పంచాయతీలుగా ప్రగతి పథంలో నడపామన్నారు.

ఐక్యంగా పని చేసినం: ఎంపీపీ ఇందిరా

మాజీ మంత్రి, చైర్మన్‌తో సహా పార్టీలకతీతంగా మండలం అభివృద్ధికి కలిసి కట్టుగా పని చేసినట్లు కీసర ఎంపీపీ ఇందిరా తెలిపారు. అధికారులు, ఉద్యోగుల ఎంతగానో సహకరించారన్నారు.

రాజకీయాల్లో ఉన్నత స్థాయికి ఎదగాలి: డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్

జెడ్పీ పాలక వర్గ సభ్యులందరూ భవిష్యత్‌లో రాజకీయంగా ఉన్నత స్థాయికి ఎదగాలని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి ఆకాంక్షించారు. ప్రజా సమస్యలపై సభల్లో చర్చించుకున్నా.. తర్వాత అభివృద్ధి విషయంలో అందరం కలిసికట్టుగా పని చేసినట్లు తెలిపారు.



సంక్షేమ ఫలాలు అర్హులకు చేర్చాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: సంక్షేమ ఫలాలు అర్హులకు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పలువురు జెడ్పీ సభ్యులు సూచించారు. మంగళవారం మేడ్చల్‌లో జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి అధ్యక్షతన జరిగింది. చివరి సమావేశం కావడంతో ముఖ్యమైన ప్రభుత్వ శాఖలపై మాత్రమే సభ్యులు చర్చించారు. పరిశ్రమలు, జిల్లా సమగ్రాభివృద్ధి సంస్థ, ఉద్యానవనం, సంక్షేమ శాఖలు ,విద్య, వైద్యం, వ్యవసాయం తదితర శాఖల పని తీరు తదితర విషయాలు ప్రస్తవించారు. దళితబంధు, మహిళా సంఘాలకు రుణాలు, ఉపాధి అవకాశాలను మెరుగు పర్చటం వంటి అంశాలపై చర్చించారు. అయితే జెడ్పీ ప్రగతి నివేదికలో కొత్త అంశాలను పొందు పరచకుండా పాత విషయాలను మాత్రమే ప్రస్తావించడంపై సభ్యులు అభ్యంతరం తెలిపారు. దీనిపై జెడ్పీ వైస్ చైర్మన్ వెంకటేశం ప్రస్తావించగా, చైర్మన్ శరత్ చంద్రారెడ్డి స్పందించడంతో పాటు నవ్వులు కురిపించారు.

మాజీ మంత్రి.. చైర్మన్‌తో సహా సభ్యులకు సన్మానం

జెడ్పీ పాలక వర్గం ఈ నెల 4తో ముగియనుండడంతో జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డితోసహా మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, వైస్ చైర్మన్ వెంకటేశం, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఇతర జెడ్పీ, కో-ఆప్షన్ సభ్యులను పూల మాలలు ,శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్ ,డిప్యూటీ సీఈఓ నీరజా, వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశానికి ఆహ్వానం ఉన్నప్పటికీ, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ తదితరులు హాజరుకాలేదు.

నేడు పదవీ విరమణ సమావేశం

ఘట్‌కేసర్: మండలపరిషత్ కార్యాలయంలో ఈ నెల 3న (నేడు) పదవీ విరమణ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. మండల పరిషత్ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, అఖిల పక్ష నాయకులు సకాలంలో హాజరు కావాలని కోరారు. పదవీ కాలంలో మండల అభివృద్ధికి సహకరించిన నాయకులు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న సంతోష్, శివాజీనాయక్

ఘట్‌కేసర్: నీట్, నెట్ పరీక్షలను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్, ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి శివాజీనాయక్ అన్నారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలన్నారు. అలాగే ఈ నెల 4న తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అన్వర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు వినయ్ పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



మేడ్చల్: మండలంలోని రాజబొల్లారం గ్రామంలో నిర్మించిన ఆలయంలో మంగళవారం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య

ఘట్‌కేసర్: మనస్తాపం చెందిన ఓ విద్యార్థి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈదులగంటి సుధాకర్, భార్య ఇందిర, కుమారుడు రాజు (13)తో కలిసి పట్టణంలోని శివారెడ్డిగూడలో ఉంటున్నాడు. రాజు బొల్లారంలోని ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతూ అక్కడి హాస్టల్‌లో ఉంటున్నాడు. వేసవి సెలవులు కావడంతో ఇన్నాళ్లు ఇంటి దగ్గర ఉన్నాడు. పాఠశాలలు తెరవడంతో తల్లి కుమారుడు పాఠశాలకు వెళ్లి సంప్రదించగా హాస్టల్ సౌకర్యం లేదని తెలిపారు. కాగా సోమవారం కుమారుడు రాజుతో కలిసి గురుకుల అడ్మిషన్ కోసం ఇందిర మహబూబాబాద్‌కు వెళ్లింది. అక్కడి సిబ్బంది రాజును పలు ప్రశ్నలు అడిగగా సమాధానం చెప్పకపోవడంతో బాబుకు చదువు రావడం లేదని సీటు కూడా ఖాళీ లేదని, ఖాళీ అయితే సమాచారం ఇస్తామనడంతో తిరిగి ఇంటికి వచ్చారు. తల్లి మంచి స్కూల్‌లో వేస్తానని ఆమె కుమారుడికి చెప్పి పనికి వెళ్లింది. మధ్యాహ్నం వచ్చేసరికి రాజు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సాయంతో వెంటనే కిందకు దించగా అప్పటికే మరణించాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖైదీల క్షమాభిక్షకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

కుషాయిగూడ: క్షమాభిక్ష కోసం ఎంతోకాలంగా వేచిచూస్తున్న ఖైదీలు, వారి కుటుంబాల్లో సంతోషం నిండింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు ప్రభుత్వం క్షమాభిక్ష ప్రసాదించింది. సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకు ఇప్పటికే రంగం సిద్ధమైంది. దీనికి సంబంధించిన జీవోను జైళ్లశాఖ అధికారులు విడుదల చేశారు. సుమారు రాష్ట్రవ్యాప్తంగా 230 మంది ఖైదీలను నేడు విడుదల చేయనున్నారు. చర్లపల్లి కేంద్ర కారాగారం వేదికగా రాష్ట్రవ్యాప్తంగా ఖైదీల విడుదలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆటోమెకానిక్‌లకు ఆరోగ్య సంరక్షణ శిబిరం

గౌతంనగర్: ఆటో మెకానిక్‌ల కుటుంబాల ఆరోగ్య సంరక్షణ కోసం వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని మోతుల్ ఇండియా, దక్షిణాసియా సీఈఓ నాగేంద్రపాయ్ అన్నారు. మోతుల్ ఇండియా ఆధ్వర్యంలో స్మైల్ ఫౌండేషన్ సహకారంతో మంగళవారం గౌతంనగర్‌లోని మల్కాజిగిరి ముదిరాజ్ సంఘం కార్యాలయంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ నాగేంద్రపాయ్ మాట్లాడుతూ.. ఇండస్ట్రీయల్ లూబ్రికెంట్ల తయారీలో అగ్రగామిగా ఉన్న మోతుల్ ఇండియా సీఎస్ఆర్‌లో భాగంగా ఈ ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తుందన్నారు. ఆటో మెకానిక్‌లు, వారి కుటుంబాలు, ఇతర కమ్యూనిటీ సభ్యులకు ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ అందించాలన్న లక్ష్యంతో ఈ శిబిరాన్ని చేపట్టామన్నారు.

ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలి



వినతిపత్రం అందజేస్తున్న కొండల్‌రెడ్డి, ఐలయ్యయాదవ్ తదితరులు



అవుషాపూర్ ప్రభుత్వ భూమిలో కొనసాగుతున్న పనులు

ఘట్‌కేసర్: అవుషాపూర్ సర్వేనంబర్ 349లోని 28 గుంటల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరుతూ గ్రామస్తులు తహసీల్, పంచాయతీ కార్యాలయాల్లో మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు నెలల క్రితం ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు యత్నించగా రెవెన్యూ అధికారులు ప్రహరీని కూల్చివేసి అడ్డుకున్నారన్నారు. అయితే గ్రామంలోని కొందరు మళ్లీ అదే స్థలంలో తిరిగి ప్రహరీని నిర్మిస్తున్నారని అధికారులు స్పందించి ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. అందజేసిన వారిలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొండల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ఐలయ్య యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, వీరేశం, సురేశ్, రమేశ్, మల్లారెడ్డి, భానుప్రకాశ్, నాగరాజు, సల్మాన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



అవుషాపూర్‌లో పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: మండలంలోని కాచవానిసింగారం, ప్రతాపసింగారంలో 15వ ఆర్థిక సంఘం నిధులు, అవుషాపూర్, మహేశ్వరీనగర్‌లో పలు అభివద్ధి పనులకు ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ జంగమ్మతో కలిసి మంగళవారం శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాటర్ పైపులైన్, డ్రైనేజీ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకట్‌రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, రమేశ్, నాయకులు మశ్చేందర్‌రెడ్డి, రమేశ్, సుదర్శన్, బస్వరాజ్‌గౌడ్, బాల్‌రాజ్, శంకర్‌ముదిరాజ్, దినేశ్, భాను, ముఖేశ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్‌రూరల్: 44వ జాతీయ రహదారి విస్తరణ పనుల కారణంగా గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలో ఈ నెల 3న (నేడు) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ వెంకట్‌గౌడ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 33 కేవీ మయోరా, 11 కేవీ బిల్‌మెట్, బిగ్‌బాస్కెట్, ప్రమోద్‌రెడ్డి డీటీఆర్, బైసాకి దాబా ప్రాంతాల్లోని కంపెనీలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.

రైతుబంధు పథకంపై అవగాహన ..

ఘట్‌కేసర్: రైతుబంధు పథకంపై ఈ నెల 3న (నేడు) అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. శివారెడ్డిగూడలోని బంధన్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు ప్రత్యేక సర్వసభ్య సమావేశం ప్రారంభవుతుందని, రైతులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం..

పోచారం: అన్నోజిగూడలో పలు అభివృద్ధి పనులకు ఈ నెల 3న (నేడు) శంకుస్థాపన చేయనున్నట్లు చైర్మన్ కొండల్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీలక్ష్మీనరసింహాస్వామి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరీ పనులు ప్రారంభించనున్నట్లుపేర్కొన్నారు.

పచ్చదనానికే మొదటి ప్రాధాన్యత



నర్సరీలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: పరిసరాల్లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు మొదటి ప్రాధాన్యతనిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీలోని నర్సరీలు, పార్కులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువు గట్టుమీద అవెన్యూ ప్లాంటేషన్ చేయాలని అధికారులను ఆదేశించారు. రాంపల్లిలోని శిల్పానగర్‌లో నర్సరీలు, పార్కుల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ తమ ఇంటి వద్ద మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, కమిషనర్ జి.రాజేంద్ర కుమార్, కౌన్సిలర్ గోక కళావతి, డిప్యూటీ ఇంజినీర్ సుదనర్శనం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదు

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



అల్వాల్: అభివృద్ధి పనులను అడ్డుకుని రాజకీయం చేయడం సరికాదని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. రోడ్డు విస్తరణ పేరుతో స్థానికులను ఎమ్మెల్యే ఇబ్బంది పెడుతున్నాడంటూ.. ఓల్డ్ అల్వాల్ చౌరస్తాలో మంగళవారం కొందరు నిరసన ప్రదర్శన చేయడంపై ఎమ్మెల్యే స్పందించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజల పన్నులతో జరిగే అభివృద్ధి పనులను రాజకీయ స్వార్థం కోసం అడ్డుకోవడం శోచనీయమన్నారు. నిత్యం ట్రాఫిక్‌తో సతమతమవుతున్న ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం గతంలో పలుమార్లు ప్రధాన కూడలి అభివృద్ధి కోసం ప్రతిపాదనలు రూపొందించామని, దీనికి అనుగుణంగానే ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. వివిధ కారణాలతో పనులు వాయిదా పడుతూ వస్తున్నాయని, ఈ సమస్య పరిష్కరించాలని కోరితే కొందరు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాని అధికారులను కోరుతున్నానని, వ్యాపారులను నష్టపరచాలనే ఉద్దేశం లేదన్నారు.

- ఆటో కార్మికుల సంక్షేమం కోసం పాటుపడిన వాడిని వారికి వ్యతిరేకం కాదన్నారు. మయమాటలతో వారిని కొందరు రెచ్చగొడుతున్నారన్నారు.
- ట్రాఫిక్ నియంత్రణ కోసం ట్రాఫిక్ పోలీసులతో చర్చిస్తే రోడ్డు విస్తరణ అంటూ.. స్థానికులను పక్కదోవ పట్టిస్తున్నారని, ఇది సరికాదన్నారు. అభివృద్ధే ధ్యేయంగా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నామన్నారు.
- ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిరంతరం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

మున్సిపల్‌లో రాజకీయాలకు ఫుల్‌స్టాప్..!

- కాంగ్రెస్ గూటికి మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్
- ఇన్‌చార్జి లేకుండానే చేరికలు
- రెండు వర్గాలుగా చీలిన మేడ్చల్ హస్తం పార్టీ..!



మేడ్చల్: 'కుర్చీ అందుకోవాలని ఒకరు.. ప్రత్యర్థులకు దక్కకుండా చేయాలని మరొకరు' ఎత్తు పై ఎత్తులుగా కొన్ని రోజులుగా మేడ్చల్ మున్సిపాల్టీలో చేస్తున్న రాజకీయలకు ఫుల్‌స్టాప్ పడింది. అసెంబ్లీ ఎన్నికల వరకు మేడ్చల్‌లో బలంగా ఉన్న బీఆర్ఎస్ తర్వాత కౌన్సిలర్ల జంపింగ్‌లతో ఒక్కసారిగా డీలాపడింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు 13 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు చైర్ పర్సన్‌ను పదవి నుంచి దించాలనే లక్ష్యంతో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్ అండతో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారితో పాటు మరో ఇద్దరు కూడా చేరారు. మున్సిపాలిటీలో అవిశ్వాసం ప్రవేశపెట్టాలంటే 16 మంది సభ్యుల మద్దతు కావాలి. ఆ సంఖ్య కాంగ్రెస్‌కు ఉండడంతో అప్పుడే కలెక్టర్‌కు అవిశ్వాసం నోటీసు ఇచ్చారు. మేడ్చల్ మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ వారు ప్రయత్నాలు చేపట్టారు.

నాయకులకు.. నాయకులే అడ్డుపుల్ల..

మెజార్టీ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్ఎస్ చైర్ పర్సన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గుతుందనే దశలో ఆ పార్టీ నాయకులే అడ్డు తగిలారు. చైర్‌పర్సన్ భర్త నర్సింహారెడ్డి తమ పదవిని కాపాడుకునేందుకు తన వర్గం కౌన్సిలర్లతో కలిసి మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి తాము కాంగ్రెస్‌లో చేరతామని ప్రకటించారు. దీంతో అవిశ్వాసం నోటీసు ఇచ్చినా సమావేశ తేదీని నిర్ణయించకుండా అధికారులతో అధికార పార్టీ నాయకులు కాలయాపన చేశారనే ప్రచారం జరుగుతోంది.

చైర్‌పర్సన్‌ను చేర్చుకోవద్దని కౌన్సిలర్ల అల్టిమేటం..

చైర్‌పర్సన్ దీపికను ఆమె భర్త నర్సింహారెడ్డిని ఎట్టి పరిస్థితిలో కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని, తామ మాట వినకుంటే పార్టీ నుంచి వెళ్లిపోతామని బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్‌కు తేల్చిచెప్పారు. ఇన్నాళ్లు చైర్‌పర్సన్‌ను చేరికను వజ్రేశ్‌యాదవ్ వర్గం నాయకులు అడ్డుకున్నారు. వజ్రేశ్‌యాదవ్ తనను నమ్మి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన వారి మాట ప్రకారం అవిశ్వాసం పెట్టి దీపికను గద్దె దించాలని చూసినా ఆ పార్టీ నాయకులే అడ్డుకున్నారు. దీపికను చేర్చుకునే విషయంలో వ్యతిరేకంగా ఉన్న కౌన్సిలర్లకు వజ్రేశ్‌యాదవ్ మద్దతుగా ఉండగా.. మిగతా ముగ్గురు నాయకులు సానుకూలంగా ఉండడంతో రాజకీయం రసవత్తరంగా నడిచింది.

ఎవరూ లేకుండానే..

మున్సిపల్ చైర్‌పర్సన్ , ఇద్దరు కౌన్సిలర్లు, పట్టణాధ్యక్షుడు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరడం ఓ నాయకుడి ఇంటి వద్ద అంతా గోప్యంగా జరిగింది. పట్టణ కాంగ్రెస్ నాయకులు, సీనియర్లు, కౌన్సిలర్లు ఇలా ఎవరూ లేకుండా ముగ్గురు నాయకులు సుధీర్‌రెడ్డి, హరివర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్ చైర్మన్‌కు, ఆమె వర్గం కౌన్సిలర్లకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ చేరికతో మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ మరింత బలపడే సూచనలు కనిపిస్తున్నాయి. ఇన్నాళ్లు పదవి కోసం రాజకీయలు చేసిన నాయకులు వారికే తెలియకుండా మలుపులు తిరుగుతూ అంతా ఒకే చోటికి చేరడంతో వారి ఆశలు అడియాశలు అయ్యాయి.

కాంగ్రెస్‌లో చేరిన మున్సిపల్ చైర్ పర్సన్



కాంగ్రెస్ లో చేరిన మున్సిపల్ చైర్ ఎర్సన్ , బీఆర్ఎస్ కౌన్సిలర్లు

మేడ్చల్: మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ దీపికానర్సింహారెడ్డి మంగళవారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు ప్రభాకర్‌గౌడ్ సమక్షంలో మున్సిపల్ చైర్ పర్సన్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు శేఖర్‌గౌడ్, కోఆప్షన్ సభ్యురాలు గీతామధుకర్, చైర్ పర్సన్ భర్త నర్సింహారెడ్డి చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వినతిపత్రం అందజేత

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ అంజనపురి, సెలెక్ట్ టాకీస్ వెనుకభాగం, కౌకూర్, భరత్‌నగర్ కాలనీల్లో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లు బాగు చేయాలని కోరుతూ.. మంగళవారం తెలంగాణ ఓబీసీ మోర్చా ప్రచార కార్యదర్శి మొయి సుజాత ఆధ్వర్యంలో అల్వాల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాలనీల్లో రోడ్లు బాగు చేయించి వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.